# చిగుళ్ళు

నిలువుటద్దం ముందు వయ్యారంగా నిల్చబడిన ఒక సోకులాడి తీరిగ్గా అందగించుకోవాలని ఆతురత పడుతున్నట్లుగా ఆ ఊరు మునిమాపు వేళ ముస్తాబు చేసుకోవడానికి సిద్ధపడుతూ ఉంది.

పసిడి ఛాయల ఎత్తిపోతల్లో తలమునకలవుతూ పడమటికొండ కొనకొమ్మును రాగరంజితం చేస్తున్న సూర్యుడు...కడుపారమేసి పొదుగుల నిండా చేపి అరమోడ్పు కన్నులతో ఇంటి ముఖం పట్టిన ఆలమందలు...అప్పుకో ఆశ్రయానికో ఉన్నవాడి చుట్టూ చెప్పులు అరిగేటట్టు తిరిగే లేనివాడిలా రాత్రి తలదాచుకోవడానికి తావుకై చెట్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ పక్షులు... వంచిన నడుం ఎత్తకుండా పొద్దస్తమానమూ రక్తాన్ని చెమటగా మార్చిన తృప్తితో పొలాల్లో రైతులు...నిగనిగ బంగారు కాంతులను నిలువెల్లా నింపుకొని ఆఊరికి కాపలాకాస్తున్న వీరుల్లా బోడి గుట్టలు...గాలివాటంగా ఉయ్యాలలూగుతూ పైరు పచ్చలు...

చిత్రిస్తూ చిత్రిస్తూ వుండిన ఒక రమణీయ వర్ణచిత్రం మీద ఉన్నట్లుండి సిరా వొలికి పాడైనట్లు మునిమాపువేళ ఆఊరు ముచ్చటపడి చేసుకొంటున్న ముస్తాబు ఛిద్రమై పోయింది- ఆగమేఘాల మీదొక పోలీస్ వ్యాన్ ఆ ఊళ్లోకి రావడంతో!

ఆ ఊళ్లో రచ్చబండ వద్ద పోలీస్ వ్యాన్ నిలబడింది. నిలబడీ నిలబడక ముందే అందులో నుండి ఒక సబ్ ఇన్స్పెక్టర్, ఇద్దరు పోలీసులూ గబ గబ కిందికి దిగారు.

వాళ్ళను చూసిన పిల్లలు 'పోలీసోళ్లు! పోలీసోళ్లు!' అంటూ పరుగెత్తుతున్నారు. 'ఊళ్లో కావాలన్నా సారాయి కలికానికైనా దొరకదే?...మద్యపాన నిషేధాన్ని అక్షరాలా అమలు జరిపిస్తున్నామే. మరి ఈ వేళకాడ పోలీసులు రావడమా?' అని ఆడవాళ్ళు ఆశ్చర్యంగా పోలీస్‌వ్యాన్‌ని చూస్తున్నారు. వయసు పైబడి ఇంటి పట్టున్నే ఉన్న కొంతమంది పెద్దోళ్ళు ఆ వ్యాన్ వద్దకు 'పోవాలా? వ..ద్దా?' అన్న సంశయంలో పడి తటపటాయిస్తున్నారు.

'పోలీసోళ్లయితే ఏం? వాళ్లకేమన్నా రొండు కొమ్ములు గిమ్ములు మొల్సి ఉంటాయా?' అంటూ కొందరు యువకులు ఆ వ్యాన్ దగ్గరికి పోయారు.

"ఈ ఊళ్లో పరమానందరెడ్డి ఇల్లెక్కడ?"

వ్యాన్ దగ్గరికి వచ్చిన యువకులను ఉద్దేశించి సబ్-ఇన్స్పెక్టర్ అడిగాడు.

"పరమానందరెడ్డి ఇల్లెక్కడా? అయనకేం గాచ్చారమా ఇల్లెక్కేదానికి? రిపేరో పాడో వస్తే కూలోళ్లను పెట్టి ఇల్లెక్కమంటాడు."

"ఏమన్నావురా రాస్కెల్?...నాతోనే పరాసకమా?" బదులు చెప్పిన యువకుడి పైకి లాఠీకట్టె లేచింది. వాడు కాలికి బుద్ధి చెప్పాడు.

"సా....సా!...వాడొక పిచ్చినాయాలు. ఆ యదవనాయాల్తో ఏంపనిగానీ నేను చూసిస్తా, నాతో రండి సా!..." ఇంకొక యువకుడు తెలివిగా పోలీసుబుద్ధితో పోటీపడ్డాడు.

సబ్-ఇన్స్పెక్టర్ కనుబొమ ముడివిప్పాడు. లాఠీకట్టెను దించాడు. ఆ కుఱ్రవాడి వైపు సానుకూలంగా చూశాడు. ఆ తర్వాత 'పద పోదాం!' అన్నాడు. వాడు ముందు. వాడి వెనుక సబ్-ఇన్స్పెక్టర్. అతని వెనుక సాయుధహస్తులై ఇద్దరు పోలీసులు. రెండు సందుల్లో దూరి మూడు మలుపులు తిరిగి ప్రక్క వీధి చేరుకొన్నారు.

ఆ వీధికే అలంకార ప్రాయంగా పరమానందరెడ్డి మహడీ!

వాడు సందు మొగదల నిలబడ్డాడు. అటు యిటు చూశాడు. కుడిచేతిని పైకెత్తాడు. చూపుడు వ్రేలిని పరమానందరెడ్డి మహడీ మీదికి గురిపెట్టాడు. సబ్-ఇన్స్పెక్టర్ మొహంలోకి చూస్తూ "అద్దో అడ కనబడ్తా ఉండాదే...అదే పరమానందరెడ్డి మాడీ!" అని అన్నాడు. సబ్-ఇన్స్పెక్టర్ పోలీసులు ఆ ఇంటి దగ్గరికి నడుస్తూ ఉంటే వాడు నిలబడిన చోటు నుండి కదలకుండా వాళ్లనే చూస్తున్నాడు.

చీకటి వెలుగుల దారాలతో కలనేసిన పట్టుకోకలా ఉంది సంధ్య!

ఇంటి ముందు నిలబడిన పోలీసులను చూసి పరమానందరెడ్డి గుండెల్లో రాయి పడింది. అయినా అదేమీ బయటికి పొక్కకుండా "రండి. ఇన్స్పెక్టర్ గారూ! రండి. రండి." అంటూ ఆదరా బాదరా ఇంటి ముందు తిన్నెమీద మంచం వాల్చాడు. లోపలికి పోయి తెల్లటి దుప్పటి తెచ్చాడు. విదిలించి మంచం మీద మట్టసంగా పరిచాడు. "గడప తొక్కోనొచ్చి గడపదాటకుండా నిలబడిపోతే ఎట్లాసార్? రండి. రండి. వచ్చి కూర్చోండి సార్!" అంటూ వినయంగా నిలబడి చేతులు జోడించాడు.

"రెడ్డీ! నీ మన్నన మర్యాదలట్లా పక్కనబెట్టు. మేము వచ్చింది అందుకు కాదు. నిన్ను అరెస్టు చేసి తీసుకొని రమ్మని ఆర్డర్స్."

"నాకు అరెస్ట్ ఆర్డర్సా?"

"అవునయ్యా అవును! నిన్ను అరెస్ట్ చేస్తున్నాం."

సందు మొగదల నిలబడుకొన్న యువకుడు పరుగందుకొన్నాడు.

క్షణాల్లో ఊరు గుప్పుమనింది.

నిముషాల్లో ఊరూరుగా పరమానందరెడ్డి ఇంటి ముందు చేరిపోయింది.

"నేనేం తప్పు చేశానయ్యా నన్ను అరెస్ట్ చేసేదానికి?"

"ఆ సంగతి యిక్కడెలా తెలుస్తుంది? స్టేషన్ కొస్తే కమ్ముల వెనక తోస్తారు. అప్పుడు తెరతీస్తారు. నడు నడు. మంచిగా వచ్చి వ్యాన్ ఎక్కుతావా...."

పరమానందరెడ్డి ఆ ఊళ్లో మేటి రైతు. ఉన్నవాడే కాదు. అంతో యింతో పరపతి ఉన్నవాడు. ఊళ్లో ఒక విధంగా పెత్తనం చలాయిస్తున్నవాడు కూడా. అయినా ఎదురైన పరిస్థితి?...కలలో కూడా ఊహించనిది. మనిషి వణికిపోతున్నాడు. ఏమి చెప్పాలో తోచడం లేదు. ఏమి చెయ్యాలో తెలియడం లేదు. కాలు కదలడం లేదు. నాలుక పిడచగట్టి మొగం నల్లబడింది. దిక్కెవరన్నట్లుగా దిక్కులు చూస్తున్నాడు. అప్పుడు రంగ ప్రవేశం చేశాడు బాలకృష్ణ. కొంత చదువు. అంతకంత లోక జ్ఞానం. తోడుగా వినయ సంపద. పదిమందిని ఒక తాటిమీద నడిపించగల సామర్థ్యం!

"ఇన్స్‌పెక్టర్ గారూ! తమ చేతిలో అధికారం ఉంది. ఆ అధికారం జారీచేసిన అరెస్ట్ ఆర్డర్స్ ఉన్నాయి. వాటిని ఎదిరించే దమ్ము ఎవరికుంది? అయినా నాదొక మనవి. పల్లెల్లో అంతో యింతో పరువుగా బతికే రైతులం. ఇట్లాంటి అవమానాల పాలైతే మరలా ఈ పల్లెల్లో తలెత్తుకొని తిరగలేము. గొప్ప మనసు చెయ్యండి. మీరు అనుకుంటే ఏదో ఒక దోవ దొరక్కుండా పోదు" అంటూ చేతులు పట్టుకొన్నాడు.

చేతిలో చేయి కలిసింది.

పోలీసు బుద్ధి కొంత మెత్తబడింది.

"అయినా నన్నేం చెయ్యమంటావయ్యా! మీరు మీరు పోట్లాడుకునేది. మధ్య మా మీదికి తెచ్చి పెట్టేది. వాడెవుడు హరిజనుడు? వాడి పేరేమి?"

"రంగడు సార్!" ఒక పోలీసు గుర్తు చేశాడు.

"ఆ రంగడు. ఏం రెడ్డీ! వాడికి నువ్వు అప్పిచ్చినావా?"

"ఇచ్చినాను సార్"

"బాండు పత్రాలున్నాయి కదా?"

"ఉన్నాయిసార్"

"ఉన్నాయి కదా? మరి వాటికి పరిష్కారం ఎక్కడ జరగాలి?"

"కోర్టులో"

"మరి కోర్టుకు పోకుండా వాడి మీదికి పోతే?"

"ఎవురు ఎవురి మిందికి పోయ్‌నారు సార్? నేను వాడి మీదికా?"

"అవునయ్యా అవును. సాక్షాత్ నువ్వే. వాడి మీదికే!"

"సార్. దేవుడి సాక్షిగా చెప్తున్నాను. బాండు కోర్టులో దాఖల్ చేసినానే కానీ వాడిని

పల్లెత్తు మాట అనలేదు."

"అన్నావో లేదో మాకేం తెల్సు? .....వాడిచ్చిన కంప్లెయింట్ అదీ!"

"నామీద కంప్లెయింట్ యిచ్చినాడా?"

"ఇచ్చినాడయ్యా యిచ్చినాడు. 'ఒరే తక్కువ జాతినా కొడకా! కుయ్యో మొర్రో అంటే పోనీలే పాపం! అని సమయానికి సహాయం చేస్తే నన్నే కోర్టుకెక్కిస్తావా? మాల నా కొడకా. అప్పు దుడ్లు అక్కడ పెట్టి కదల్రా. లేకుండా బోతే నిన్నిక్కణ్ణే నరికి పొలిజల్లేస్తా. ఏ నా కొడుకు అడ్డమొస్తాడో చూస్తా! నీ ఇంటికి అగ్గి పెట్టిస్తా!' అని బండ బూతులు తిట్టా బెదిరించినావంట. వాడేం చేశాడు? ఏ క్షణంలో అయినా నీ ద్వారా తన ప్రాణం మీదికే ముప్పు వస్తుందని కంప్లెయింట్ రాయించి సాక్షాత్ మీఎమ్మెల్యే ద్వారానే ఏకంగా మా ఎస్పీ దొరగారి చేతికిప్పించాడు. ఇంకే ముంది? మా దొరగారికి మీ ఎమ్మెల్యే మెహర్బానీ కావాలి. ఎమ్మెల్యేకి హరిజనుల ఓట్లు కావాలి. నడిమిద్దె మాదేముంది? పై ఆఫీసర్లు చెప్పినట్లు చేయాలి. లేకపోతే చెప్పుదెబ్బలు మీకు కాదు. మాకు. 'పో! ఉన్న ఫళంగా వాణ్ణి అరెస్ట్ చేసి తీసుకురా!" అంటే వచ్చాను. ఇప్పుడు చెప్పండి. నన్నేం చెయ్యమంటారో మీరే చెప్పండి."

పరమానందరెడ్డి మొగంలో కత్తివేటుకు నెత్తురు చుక్క లేదు.

"ఒరే నంగి నాకొడకా! ఎంత పని చేసినావురా!" అని మనస్సులో అనుకొన్నాడే కానీ పైకి అనలేకపోయాడు.

"చూడండి ఇన్స్పెక్టర్ గారూ! పరిస్థితి బాగా అర్థమవుతూనే ఉంది. అయితే మా పరిస్థితి కూడా కొంచెం ఆలోచించండి. ఈ ఒక్క దినం మాకు అవకాశం ఇవ్వండి. ఊళ్లో పెద్ద తలకాయలున్నాయి గదా. రాత్రికి రాత్రే మద్దిస్తం పెట్టిస్తాం. మద్దిస్తంలో తెగకుండా పోతే మేమే రెడ్డయ్యను తెచ్చి మీకప్పగిస్తాం. మీకు తెలియదని కాదు. 'అక్యూజ్డ్ ఆబ్ సెంట్' అని ఒక్క ముక్క రాసుకుంటే మీ నెత్తిన చెత్తెత్తే నాయాలు ఎవుడుంటాడు" బాలకృష్ణ కల్పించుకొన్నాడు.

"అది సరే! అనుకో. అయినా వాడున్నాడు గదా రంగడు. ఇదంతా వాడి చెవిలో పడకుండా పోతుందా? వాడు మళ్లీ పిటిషన్ పెట్టాడు. అప్పుడు మీ గొంతుల మీదికి కాదు ఏకంగా నా గొంతుకే వస్తుంది."

"అంతదూరం రానిస్తామా సార్. ఈ రాత్రే మద్దిస్తం పెట్టి తేల్చి పారేస్తాం. మీరు రండిసార్" అంటూ బలవంతంగా రెడ్డిగారి ఇంట్లోకి పిలుచుకొని పోయాడు.

"రెడ్డిగారూ! మీరు రైతులు. మిమ్మల్ని ఇబ్బంది పెట్టడంతో నాకేమీ వొరిగేది లేదు. లేదంటే పై ఆఫీసర్లు. వాళ్ళు చెప్పినప్పుడు అది మంచో చెడో పాటించక తప్పదు కదా? అందుకే తటపటాయిస్తున్నాను. ఈ రోజుల్లో హరిజనులు, గిరిజనులతో పెట్టకోవడమంటే కొరివితో తలగోక్కున్నట్లే. అందుకే చెప్తున్నాను. ఈ రాత్రికే మీరు ఏదో ఒక విధంగా రాజీ పడడం మంచిది. నేను వెళ్లొస్తాను" అంటూ సబ్-ఇన్స్పెక్టర్ రెడ్డిగారి వద్ద సెలవు

తీసుకొన్నాడు.

రచ్చబండ వద్ద వ్యాన్ కదిలింది నమస్కారాలు స్వీకరిస్తూ!

ఊరు 'హమ్మయ్య!' అని నిట్టూర్చింది.

పరమానందరెడ్డి బాలకృష్ణ రెండుచేతులు పట్టుకొన్నాడు.

"దీంట్లో ఏముందిలే రెడ్డయ్యా. నువ్వు పద ఇంటికి. నేను మద్దిస్తానికి ఏర్పాట్లు చేస్తా!" చేతులు విడిపించుకొంటూ బాలకృష్ణ అన్నాడు.

పరమానందరెడ్డి 'సరే'అన్నట్లుగా తల ఆడించాడు. ఆడించిన తలను వంచాడు. వంచిన తల పైకెత్తకుండా అడుగు మీద అడుగ్గా ఇంటికి నడిచాడు. ఇంట్లో అడుగు పెట్టాడు. పట్టె మంచం మీద కుప్పగా కూలిపోయాడు.

కరెంటు కోత కారణంగా ఇల్లంతా చీకటి!

"నాన్నా!"

కూతురు పిలిచింది. ఆ పిలుపు అందుకొన్నట్లుగా అప్పుడే కరెంట్ వచ్చింది. ఇంటి నిండా వెలుగు. పరమానందరెడ్డి తల పైకెత్తాడు. ఆ వెలుగులో కళావిహీనంగా కూతురి మొగం. ఆ మొగాన్ని చూడలేనట్లుగా తల వంచుకొన్నాడు.

"మనిషి తెలిసో తెలియకో ఏదో ఒక తప్పు చేస్తాడు. అయితే నమ్మక ద్రోహమంత తప్పు యింకొకటి వుండదు నాన్నా!"

"చచ్చిన పామును కొట్టే దానికే వచ్చినావా అమ్మా!"

రెడ్డయ్య కూతురు ఇందిర భారంగా నిట్టూర్చింది.

❋ ❋ ❋ ❋

జాము రాత్రి కావస్తూ ఉంది. ఊరు మాటు మణిగేవేళ. అయితే ఆ రోజు మాత్రం రచ్చబండ వద్ద సందడి సందడిగా ఉంది.

ఊళ్లో మద్దిస్తం అంటే అక్కడ పరిష్కారం కావలసిన సమస్య ఏదైనా సరే. అది ఎవరికి సంబంధించినదైనా సరే! ఆ ఊళ్లో ప్రతి వ్యక్తి తనదిగానే భావిస్తాడు. అందుకే తలనెరిసిన పెద్దలే కాదు ఊరూరుగా అక్కడ గుంపు చేరుతుంది.

ఆ వేళ మద్దిస్తం సంగతిని మడివేలుతో బాలకృష్ణ ఇంటింటికి చెప్పి పంపాడు. తానే స్వయంగా పోయి రంగడిని మద్దిస్తానికి రమ్మన్నాడు. పరమానందరెడ్డిని వెంట బెట్టుకొని రచ్చబండ వద్దకు వచ్చాడు. అప్పటికే గూని గుర్రప్ప...కుంటి ముత్యాలు....నల్లమ్మోళ్ళ నాగులు నాయుడు... వెంకట్రాయులు తాత అక్కడికి చేరుకొన్నారు. వీళ్ళు ఊళ్ళో ఏ మద్దిస్తానికైనా ముందుంటారు. చెప్పే తీర్పు కూడా తన మన అనుకోకుండా నిష్పాక్షికంగా చెప్తారు. గుంపు చేరిన ఊళ్లో వాళ్లు రచ్చబండ ముందు కూర్చున్నారు. పెద్ద మనుషులు, బాలకృష్ణ. పరమానందరెడ్డి రచ్చబండమీద కూర్చున్నారు.

తనకు తోడుగా వచ్చిన పది, పన్నెండు మంది పక్కన నిలబడగా రంగడు మడిచేతులు కట్టుకొని పెద్ద మనుషుల ముందు నిలబడ్డాడు.

"ఇంకా ఆలస్యం ఎందుకు? కానీయండి మరి?" అన్నారు హెచ్చరిస్తున్నట్లుగా. రచ్చబండ వద్ద సద్దుమణిగింది.

"ఏమిరా రంగా?... ఇప్పుడు నువ్వు చేసిన పని సరిపోతిందంట్రా?"గూని గుర్రప్ప గూటించాడు.

"రెడ్డయ్యను అడగాల్సిన మాట నన్నడిగితే నేనేం జెప్పేది గూనెయ్యా?"

"పోలీసు కంప్లీటు నువ్విచ్చి రెడ్డయ్యను ఏమని అడగమంటావురా?" కుంటి ముత్యాలు అందుకొన్నాడు.

"నేన్జెప్పేది గూడా అదేనయ్యా! నేనెందుకు కంప్లీటు యియ్యాల్సి వచ్చిందో రెడ్డయ్యనే అడగండని"

"ఒరే నీయమ్మా బడవా! నిన్నడగతా ఉంటే నువ్వు రెడ్డయ్యను అడగమంటే దాని అర్తమేందిరా?" వెంకట్రాయులు తాత మందలింపుగా అన్నాడు.

"తాతా! ఊరికైనా వాడకైనా నువ్వు తాతవే గదా? వరి కొకనాయం, ఊదర కొక నాయమా? వద్దు. పాలన్నం తినే పదిమంది పెద్ద మణుసులుండారు. మీరే చెప్పండి. కుందనపు బొమ్మె నా కూతురు. బాయిలో దూకి చచ్చె. ఎందుకు చచ్చె?"

"గడ్సిపొయ్యింది పోనీలేరా. ఇప్పుడదెంతా తొవ్వి తలకెత్తుకుంటే ఏమి లాబం? రెడ్డయ్యేమోవాణ్ణి నేను పల్లెత్తు మాట అన్లేదని అంటా ఉండాడు. నువ్వేమో అన్రాని మాట్లన్నాడని కంప్లీటిచ్చినావు. ఎందు కిచ్చినావురా అంటే నువ్వే మల్లా ఎనికెనిక్కిపోతే ఎట్రా?" గూని గుర్రప్ప గుడ్లురిమాడు.

"గూనెయ్యో! ఎనిక్కి పోతే గానీ ముందుకు పోలేము. అదే చెప్తా ఉండా. అందురు యినండి. నాలో తప్పుంటే కాలి కుండేది చేతికి తీసుకోండి."

"జరిగింది అదేందో చెప్పి ఏడవరా అంటే యిప్పుడెందుకురా ఈ కళ్ళేడుపు?' నాగులునాయుడు కలగ చేసుకొన్నాడు.

"చెప్పి ఏడ్సుకోవాలనే గదా సామీ నేనొచ్చింది. తలా వొక పక్క పట్టుకొని గూటిస్తా ఉంటే నేనేమని చెప్పేది. యింకేమని ఏడ్సేది? మల్లా నా కూతురి కత ఎత్తుకుంటే కడుపు చించుకుంటే కాళ్ళ కాణ్ణే పడినట్లవితింది. ఎవురు పుణ్ణెం కట్టుకున్నారో ఊరికంతాతెల్సు. అప్పుడు మా వాళ్ళంతా నా చుట్టూ చేరుకొని పురెక్కించిరి. రెడ్డయ్య మింద పోలీస్ కంప్లీటియ్యమని సతపోర్రి. చచ్చిన బిడ్డె తిరిగి రాబొయ్యేది లేదు. ఒక పెద్దమణిసిని ఎత్తి యీదిలో పెడ్తే నాకెవురూ కుచ్చల కుళ్ళాయి పెట్టబొయ్యేది లేదు. అంటా వాళ్ళతో వాదులాడ్తి. 'ఈ పొద్దు నీకయింది. రేపు మా కవదంట్రా కుండాకోర్ నా కొడకా!' అంటా వాడ వాడగా నన్ను నిల్దీసె. నేను నీలుక్కుణ్ణానే గానీ వాళ్ళ మాట్లకు తలొంచినానా? లేదే. అప్పుడు రెడ్డయ్య పిలిపించె. పోతి. 'ఒరే రంగా! నువ్వింత మంచోడని కల్లోగూడా అనుకోలేదురా. బుద్ధి గెడ్డి తినింది. అయినా కడుపులో పెట్టుకొని నా పరువు కాపాణ్ణావు. తప్పుజేసినోడు శిచ్చ అనబవించాల్సిందే. నా తప్పుకు నేనే శిచ్చ ఏసుకుంటా వుండా. నువ్వు

రాసిచ్చిన నోటు చింపి పారేస్తాను. పోరా!' అనె. రొండు సేతులెత్తి దణ్ణం పెడ్తి. ఈపొద్దు నోటు కోరట్లో దాకల్ చేస్తాడా?"

"ఏం రెడ్డయ్యా నువ్వేమంటావ్?" వెంకట్రాయులు తాత అడిగాడు.

"పొయ్ పొయ్ వాడి మాటలు మీరునమ్మతా ఉండారా? తక్కవ జాతోడికి ఎప్పుడూ తక్కవ బుద్దులే. నాకేమన్నా పిచ్చా? లేకపోతే తిమురా? ఒకటా రొండా? అష్టాబాపత్తుగా అరువేలే?... అటువంటి నోటును చింపేస్తానని మాట వరసకన్నా ఎవుడైనా అంటాడా?"

"ఏమిరా రంగా?"

"నా ముగ్గురు బిడ్డల సాచ్చిగా చెప్తా వుండా. నేను అపద్దం చెప్తే వాళ్లు నాకు దక్కరు"

"అది సరే రా. నువ్విచ్చిన కంప్లీటుకు దీనికేమి సంబందం?"

"రెడ్డయ్య అన్నెట్టు నేను తక్కవ జాతోణ్ణే. నాది తక్కవ బుద్దే. రెడ్డయ్యది గొప్ప జాతి కదా? ఆయన్ది గొప్ప బుద్ది కదా? అటుమంటి గొప్ప బుద్దే అనిన మాట్నే అన్లేదంటే నేను తక్కవ బుద్దోణ్ణి. ఆయన అనని మాట్నే అన్నాడంటి"

"ఇది నీకు దర్మసమ్మతంగా ఉండాదంట్రా?

"ఏంది దరమ్మో? ఏంది అదరమ్మో మీరే సెప్పండయ్యా. మూడు వేలిచ్చె. ఆరు వేలకి నోటురాసి పెట్టుకుండె. ఊరినాయం. దర్మవడ్డీ నూటికి రొండ్రూపాయలైతే నా దగ్గిర తన్ని అయిదు రూపాయిల్లెక్కన వసూలు జేసె. బంగారట్టా బిడ్డను నా కూతుర్ని పొట్టన బెట్టుకుండె. ఇప్పుడు మూడు వేలిచ్చి ఆరువేలకు కోరట్లో నోటు దాకల్ జేసె. నా పరిచ్చితిలో మీరుంటే ఏం జేస్తారో మీరే సెప్పండి?"

"ఏం రెడ్డయ్యా? వాడు నిల్దీసి అడగతా ఉండాడు. బొదులు ఏం జెప్తావో చెప్పు" వెంకట్రాయులు తాత పరమానందరెడ్డిని నిలదీశాడు.

"నేను చెప్పాల్సింది ఎప్పుడో చెప్పినాను గదా?"

"కూతుర్ని దారపోసుకోని గూడా కంప్లీటీనోడు ఈ పొద్దు యిచ్చినాడంటే-నువ్వు మాట తప్పినట్టే నాకనిపిస్తా ఉండాది."

"తాతా! రెడ్డయ్య మాట తప్పాలని కల్లోగూడా అనుకోలేదు. ఆ సంగతి అందురి కంటే నాకు బాగా తెల్సు. అయితే మొన్న జరగలా ఎలక్సన్లు! అప్పుడు పిలిపించె. పోతి. 'ఒరే రంగా నేను పార్టీ మార్సేసినా. ఈ పార్టీగ్గాదురా. ఆ పార్టీకి మీ ఓట్లన్నీ ఎయ్‌పించాల్రా!' అనె. అదెట్టా కుదిర్తింది. ఆరు నూరైనా అది మాత్రం జరిగేపని కాదంటి నేను. అది కడుపులో పెట్టుకుండె. ఆ కసితోనే యింత పని జేసె. అటుమంటప్పుడు నేనెందుకు చేతులు ముడ్సుకోని కూసోవాల. నాసేతైన పని నేనూ జేసినా. ఆయన కత ఆయన కోరట్లో చూపిస్తాడు. నా కత నేను పోలీస్ టేసిన్లో చూపిస్తా!"

"అందుకేనంట్రా మేముమద్దిస్తం పెట్టించింది" గూని గుర్రప్ప గూటింపు.

"నిజమేనయ్యా! మద్దిస్తం పెట్తిరి. నన్ను తప్పు జేసినోడి మాదిర యింత

మందిముందర నిలబెట్టిరి. అయినా నేనేమన్నా కాదన్నానా? లేదే? సత్తె పెమాణకంగా జరిగింది జరిగినట్టు చెప్పినా. యిన్నారు. నాయం మీరే చెప్పండి."

"ఇంతకూ నువ్వు చెప్పేదేందిరా?"

"అయిదు రూపాయెల్లెక్కన నేను కట్నానే వడ్డీ అది రెడ్డయ్య యిచ్చిన అసలు కంటే జాస్తిగానే ఉంటింది. అందువల్ల నేను ఒక్క దమ్మిడి గూడా బాకీ లేదు. మీరు యాడ సత్తెం చెయ్యమంటే ఆడ జేస్తా. అదే నేను ఆరువేలు బాకీఅని రెడ్డయ్యను చెయ్‌మనండి. నాకయ్యా గాలవ వొగిటికి సగంగా అయినా తెంచిపారేసి బాకీ కట్టేస్తా!"

న్యాయం మాకడివైపు ఉందని తేలిపోయింది. తెగేదాకా లాగితే పరిస్థితి చేయిదాటి పోతుందని తెలుస్తూనే ఉంది. ఏదో ఒక విధంగా దీన్ని పరిష్కరించాలనుకున్నాడు బాలకృష్ణ.

"తాతా! చిన్నవాడిని. అయినా మీరందరూ సరేనంటే నేనొక మాట చెప్తా"

"నాయానికి పెద్దా చిన్నా ఏం వుండాది. చెప్పు నాయినా!"

"ఊళ్లో కక్షలూ కార్పణ్యాలూ మనకెందుకు తాతా? పెంచుకుంటాపోతే వాటికి అంతమంటూ ఉండదు.రంగడు రెడ్డయ్యకు బాకీ లేదని సత్యం చేస్తానంటా ఉండాడు గదా. చెయ్యమందాం. అప్పుడు రెడ్డయ్య తాను కోర్టులో దాఖల్ చేసిన బాండునుతన ఖర్చుతో తాను వాపసు తీసుకొంటాడు. మాకడు వాడి తిప్పలు వాడు పడి పోలీస్ స్టేషన్లో యిచ్చిన కంప్లీటు వాపస్ తీసుకోవాలి."

"శానా శానా మంచి మాటరా అబ్బోడా. నా ఆయుస్సు కూడా పోసుకుని నూరేండ్లు బతకరా" వెంకట్రాయులు తాత ఆ తీర్పుకు ఆమోద ముద్ర వేశాడు.

"రంగడు సత్తెం చెయ్యాల గదా? ఎప్పుడో ఎక్కడో అది గూడా అనుకుంటే సరిపోలా?" కుంటి ముత్యాలు అడిగాడు.

"దీనిగ్గూడా ఒక కుంటి మద్దిస్తమా? ఎప్పుడో ఎందుకు? తెల్లార్తోనే ఎక్కడో ఎందుకు? ఈ ఊళ్ళన్నిటీ కడుపులో పెట్టుకోని కాపాడ్తా ఉండాది గదా మాతమ్మ తల్లి!" వెంకట్రాయులు తాత సందేహ నివృత్తి చేశాడు.

ఆ మాట చెవిని పడడంతో అక్కడ చేరిన యువకులు కొందరు ఒకరి మొగం ఒకరు చూసుకుంటూ తలలు పంకించారు.

చుక్క నడిమిట్టకు వస్తూ వస్తూ ఉంది.

మద్దిస్తానికి వచ్చిన వాళ్ళు ఒక్కొక్కరుగా లేచి ఇంటి దారి పట్టారు!

ఊరు మెల మెల్లగా నిద్రలోకి జారుకొంటూ ఉంది.

ఊరి ముందర చెరువులో పొట్ట నిండికి ఎండ్రకాయలు మెక్కిన పొట్టి బావలు హుషారుగా ఊళలు వేస్తున్నాయి. నిర్మలాకాశంలో చుక్కలు నిగనిగ మెరుస్తున్నాయి. ఆ నిశిలో మాటలకందని ఏదో కీచుమని శబ్దం...!

పట్టె మంచం మీద పడక పొందకుండా పరమానందరెడ్డి లేచి కూర్చున్నాడు. రెండు

చేతులను మంచం పట్టె మీద మోపాడు. మనిషి కొంచెం ముందుకు వంగాడు. తల వాల్చాడు. రంగడు గురిపెట్టి కొట్టినదెబ్బ తగలాల్సినచోటనే తగిలిందే' అని ఆలోచిస్తున్నాడు.

తండ్రి పడుతున్న మథన కూతురు ఇందిర ఒక కంట గమనిస్తూ మేలుకొనే ఉంది. తలుపు తట్టిన శబ్దం. పోయి తలుపు తీసింది!

ఎదురుగా గసపోసుకుంటా తమ్ముడు!

తలుపు తీయడంతోటే గబగబ లోపలికి వచ్చాడు. తలుపు మూసి గడి పెట్టాడు. తలుపుకు వీపు ఆనించినిలబడి 'కొంపలు మునిగిపోతాయి అక్కా!' అన్నాడు.

"ఏందిరా నువ్వు మాట్లాడేది?"

"అవునక్కా! నేను చెప్తున్నదినిజం. ఇయ్యరవ దాకా మన ఊళ్ళో యూత్ చింత తోపులో తాతయ్య సమాధి దగ్గర మీటింగు పెట్టుకున్నారు. రేపు తెల్లార్తో మాతమ్మ గుడి ముందు రక్తపాతం ఆగదు. మాదిగపల్లె నేల మట్టం కాకుండా పోదు. కత్తులు కటార్లు సిద్ధం చేసుకొంటున్నారు.

రవి వాళ్ళ మామకు ఫోన్ చేశాడు. రెండు కేసులు నాటు బాంబులు తెల్లారేకాడికి కార్లో వస్తున్నాయి. ఊళ్ళో దిగుతున్నాయి."

"అంత అవసరం వీళ్లకెందుకురా?"

"అదేందక్కా అట్లా మాట్లాడతావే? మాలపల్లె మాదిగ పల్లెలో యూత్ పట్టుబట్టి ఎమ్మెల్యే కాళ్ళూ చేతులు పట్టి మన పంచాయతీని రాత్రికి రాత్రే రిజర్వుడుగా మార్పించుకోలేదా? దాంతో రవి సర్పంచ్ కావలసింది ఒక హరిజనుడు సర్పంచ్ కాలేదా? ఆ కక్ష నివురు గప్పిన నిప్పు మాదిర ఉండె. ఇప్పుడు వాళ్ళకొక సాకు దొరికె. తిరగబడి పరిస్థితిని అదుపులోకి తెచ్చుకోవాలని తీర్మానించుకున్నారు."

"వాళ్ళకిప్పుడు సాకు దొరికిందా?"

"ఔగదక్కా! రేపు మాకడు మాతమ్మ గుడి ముందు సత్యం చేయాల కదా? ఊరి న్యాయం మాదిగ కొంపలో తెగడానికి వీల్లేదని వీళ్ళు పట్టుబడతారు. అడ్డపడతారు. ఆ పక్క కూడా యువకులున్నారు కదా? వాళ్ళ దేవత వాళ్లకు గొప్పకదా! వీళ్ళు వద్దు అంటే వాళ్ళు కద్దు అంటారు. మాటా మాట పెరుగుతుంది. అదే వీళ్ళకు కావలిసింది."

"విన్నారు కదా నాన్నా!"

పరమానందరెడ్డి తల పైకెత్తి కూతురి వైపు చూశాడు.

"వద్దు నాన్నా! రంగడు మంచి మనిషి. అప్పుడు మిమ్మల్ని రచ్చకీడవాలనుకుంటే వాడికి అడ్డమే లేదు. అయినా పల్లెత్తు మాట అనలేదు. వాడిని కోర్టుకీడవడం మంచిది కాదంటే మీరు విన్నారా?"

"ఇట్లా చేస్తే వాడేదో కాళ్ళ బేరానికి వస్తాడనుకొన్నానే కానీ... ఏకంగా యింత పనికి తెగిస్తాడని..."

"తాటితన్నే వాడొకడైతే తలదన్నే వాడొకడు. పోనీ! మద్దిస్తం జరిగింది కదా?

అప్పుడైనా ఏదో జరిగిపోయింది. ఈ సత్యాలు ప్రమాణాలుఎందుకు? కోర్టులో కేసు నేను వాపస్ తీసుకుంటానని ఒక్కమాట అనివుంటే అది ఎంత హుందాగా ఉండేది?"

"అప్పుడు మన పరువేం కావాలమ్మా?"

"ఇప్పుడేమయింది నాన్నా?!"

"వాడు అప్పులేదని సత్యం చేసినాడు కాబట్టి కేసు వాపస్ తీసుకొన్నట్లు కాలేదా!"

"కాదు నాన్నా! వాడు పోలీస్ స్టేషన్లో యిచ్చిన కంప్లెయింట్ వాపస్ తీసుకోవడానికి ఎత్తినఎత్తని తెల్సిపోతూనే ఉంది. సరే! యిదేదో ఒక విధంగా పరిష్కారం అయిందనుకుంటే వచ్చి పడిన సమస్య విన్నారు కదా?...ఒక తప్పుతో చూడండి!"

పరమానందరెడ్డి తల వాలిపోయింది.

ఇందిర ఆ రాత్రి నిద్ర పోలేదు.

ఊళ్లో యువకుల నిర్ణయం గంగముని తమ్ముడు రోశయ్య ద్వారా హరిజనవాడ అరుంధతీపురం చేరిందనడానికి మాతమ్మే సాక్షి!

❋ ❋ ❋ ❋

కరకర పొద్దు మొలిచింది.

అరుంధతీపురంలో మాతమ్మ గుడి అందాలు పోతూ ఉంది.

గుడిని శుభ్రం చేశారు. గుడి ముందు ఊడ్చి కళ్ళాపులు చల్లారు. ముగ్గులు పోశారు. మాతమ్మకు పాలాభిషేకం చేశారు. పసుపు పూశారు. కుంకం బొట్లు పెట్టారు. పూలహారాలతో అలంకరించారు. ప్రక్కన నిలబెట్టిన త్రిశూలాలకు నిమ్మపండ్లు గుచ్చారు.

మాతమ్మ దేదీప్యమానంగా వెలిగిపోతూ ఉంది.

అప్పుడు రంగడిని గుడిముందు కూర్చోమన్నారు. వాడు మొలగుడ్డతో కూర్చున్నాడు. మూడు బావుల్లోనుండి తెచ్చిన మూడుకడవల నీళ్లు వాడినెత్తిన కుమ్మరించారు. రెండు అరచేతులతో వాడు మొగం కప్పుకున్నాడు. ఆ ఉత్త అరచేతులతోనే మొగాన్ని తుడుచు కుంటూ పైకి లేచాడు. తలలో నీళ్ళు, ముత్యాల్లా భుజాల మీద పడి ఒంటి మీద జారి మొలగుడ్డతో కలిసిపోతున్నాయి. తడిసిన మొలగుడ్డలో నీళ్ళు బొట్లు బొట్లుగా వాడి కన్నీటి బొట్టుల్లా నేల పాలవుతున్నాయి. వాడి మొగాన కుంకం బొట్టు పెట్టారు. మెడలో పూల హారం వేశారు. గుడిముందు నిలబెట్టారు. వాడి ముందు చిన్న గంగాళం తట్ట. ఆ తట్టలో నిమ్మకాయంత కర్పూరం!...

ఆ కర్పూరాన్ని వెలిగించాలి..."మాతమ్మ తల్లి సాక్షిగా నేను రెడ్డయ్యకు బాకీ లేదు" అని మూడు సార్లు పలికి అప్పుడు వెలుగుతున్న కర్పూరాన్ని ఆర్పి వేయాలి.

అక్కడ చేరిన జనం అది ఒక వేడుకగా చూస్తున్నారు.

వెంకట్రాయులు తాత కర్పూరం ముట్టించడానికి అగ్గిపెట్టె చేతికి తీసుకొన్నాడు.

"నిలపండి! ఈ సత్యాలు ప్రమాణాలు ఈ మాదిగ కొంపలో జరగడానికి వీల్లేదు!" అంటూ అరవై డెబ్బైమంది యువకులు ఊళ్ళో నుండి పరుగుల మీద వచ్చారు.

జరుగుతున్న కార్యక్రమానికి అడ్డుపడ్డారు.

ఇంచు మించు అంతమంది యువకులు అరుంధతీపురం హరిజనవాడల్లో నుండి కాకితో కబురందుకొన్నట్లుగా అక్కడికి చేరుకొన్నారు.

ఇరుపక్షాల్లో ద్వేషాగ్ని ఏ క్షణంలో అయినా మంటలు కక్కడానికి అవకాశం కోసమే ఎదురు చూస్తున్నట్లుంది.

ఊళ్లో పెద్దలు అయోమయంగా వాళ్ళ వైపు చూస్తున్నారు.

"ఊరి న్యాయం తెగడానికి ఊరేమయింది? ఈ మాల మాదిగల కొంపలే కావాల్సి వచ్చాయా మీకు?" ఊళ్లో యువకులు నిలదీశారు.

"బే! ...మాటలు జాగర్తగా రానీయండి!...

"మేం మీతో మాట్లాళ్ళా...మా పెద్దోళ్ళను మేము అడగతా ఉండాం"

"ఇవ్వి మాల మాదిగల కొంపలని తెల్సుగదా? మల్లా ఎందుకొచ్చినారు?"

"అదే మేమూ మాపెద్దోళ్లను అడగతా ఉండేది. ఊళ్ళోనే రామాలయముంది. చంద్రగిరిలో మూలస్థానమ్మ ఉంది. ఏడుకొండలవాడు ఉండనే ఉన్నాడు. ఈ దేవుళ్ళందర్నీ కాదని ఈ మాదిగోళ్ళ దేవతే కావాల్సి వచ్చిందా?"

"మీ దేవుళ్ళు మీకుండారు గదా! ఆ బుద్ధి ముందే ఉండాల. మిమ్మల్ని ఎవుడైనా వక్కాకుబెట్టి పిల్సినాడా మాదిగోళ్ళ దేవతకాడికి రమ్మని!"

'రే తక్కువ జాతి నాకొడకా మాకు బుద్ధి లేదంటావా?"

"ఇద్దో మల్లా చెప్తా ఉండా. మాటలు జాగర్తగా రానీ. బుద్దిలేదన్లా. బుద్ధి యాడికి పొయ్యిందని అడగతా ఉండా!"

"ఒరే! ఏందిరా యిదంతా? మేముపెద్దోళ్ళం. ఇంకా బతికే ఉండాంరా!"

"ఆఁ! ఆఁ! పెద్దోళ్ళు పెద్దోళ్ళనుకుంటా కూసుంటే యిద్దో యిట్లా తెల్లార్తా ఉండాయి మా బతుకులు. లేకుండాబోతే నెత్తిన దుగ్గాణిపెట్టే దమ్మిడి విలువచెయ్యని నా కొడుకులు యిట్లా నీలగతారా?"

"బే! ఎవుడికి కొడుకులు! కొడుకులు గిడుకులనబాక. కడసారిగా చెప్తా ఉండాం. మరేద చెడిపోతింది. మా కొంపల్లో కొచ్చినారు. వచ్చిన పని చూసుకోని మరేదగా పొండి."

"అవునవును. పెద్ద మరేదస్తులు నా కొడుకులు మాకు మరేద చేప్పేదానికి? ఇంకా మాట్లాడేదేందిరా? వెయ్యేంద్రా!"

ఒక బాంబు 'ఢాం' అనింది.

ఆ బాంబుకు 'ఢాం! ఢాం!' అంటూ రెండు బాంబులు సమాధానం చెప్పాయి.

అక్కడ చేరిన జనంలో అరుపులు....హాహాకారాలు....ఏడుపులు....దిక్కుకొకరుగా పరుగెత్తడాలు!...

సరిగ్గా అదే సమయంలో కొంగు బిగించి కొదమ సింగంలా దూకింది ఇరు పక్షాల మధ్య ఇందిర!...ఆమె వెంట వందలాది స్త్రీలు.

సుశిక్షితులైన సైనికుల్లా...క్షణాల్లో ....యిరు పక్షాలకు యిటువైపు అటువైపు... అడ్డుకట్ట కట్టినట్లుగా నిలబడ్డారు. యిరుపక్షాల్లో యువకులు కాలు కదపడానికి వీలు లేనట్లుగా!

"రంపులూరచ్చలు...కక్షలూ కార్పణ్యాలు...మారణ హోమాలు....రక్తపాతాలు...పోలీస్ స్టేషన్లూ....కోర్టులూ....కొంపలు కొల్ల బోవడాలు....ఇదేనా జీవితమంటే? ఈ పల్లెలో ప్రశాంతంగా కాపురాలు చేయనీయరా మమ్మల్ని? ఏదో ఒక కుంటి సాకుతో ఊళ్ళ కడుపుల్లో చిచ్చు పెట్టడమేనా మీ పని? ఇంత కంటే మంచి ఆలోచనలు మీ తలకెక్కవా? కాదు. మావల్ల కాదు. ప్రతి నిత్యం యిట్లా చస్తూ బ్రతకడం మాచేత కాదు. ఇంతకంటే ఒక్కసారిగా చావడమే మంచిది. చంపండి. మమ్మల్నందర్నీ చంపండి. మా శవాల మీద నడవండి. అప్పుడు చల్లార్చుకోండి మీ ఆవేశాన్ని...మీ కసిని!...మాతమ్మ మనసు తన గొంతులోంచి పలుకుతుండే మూర్తీభవించిన శోక దేవతే అయ్యింది ఇందిర!

ఇరుపక్షాల మధ్య మానవత్వానికి వారధి కడుతూ ప్రతిగుండెను గుడిచేసే ఆఖరి ప్రయత్నంగా పడుకొన్నారు స్త్రీలందరూ.

ప్రతిస్త్రీ ఒక బోధిచెట్టులా కనిపిస్తుంటే కళ్ళు తెరిపించిన జ్ఞానంతో తలలు వాల్చింది యువత!

శిశిరంలో వసంతాలు పూస్తూ ఆశల కొమ్మకు మొలకెత్తిన చిగుళ్ల మాతమ్మ వదనంలో మందహాసాలు!●

- ఆంధ్రజ్యోతి